

8లో..

## మెరుగైన సేవలు అందించాలి

- ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారదా
- వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష



# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 064
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
ఫిబ్రవరి 18, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# టచ్ చేస్తే.. అగ్నిగుండమే

- త్రిశక్తి పీఠం కూల్చేందుకు కుట్ర
- ఎంజీఎం రోడ్‌లో హైటెన్షన్
- హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- మద్దతుగా నిలిచిన బీజేపీ

వరంగల్ ఎంజీఎం ప్రధాన రోడ్డులోని గోపాలస్వామి గుడి ప్రాంతంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన మహంకాళి త్రిశక్తి పీఠం కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని పలు హిందూ సంఘాలు ఆరోపించాయి. భక్తులు కోరిన కోర్కెలు నెరవేర్చుతూ వారికి కొంగుబంగారంగా వెలుగొందుతున్న త్రిశక్తి పీఠంను టచ్ చేస్తే ఊరుకోబోమంటూ హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా హిందూ ధర్మాభిమానులు, భక్తులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి శక్తి పీఠం పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. దీంతో పోలీసులు సైతం అధిక సంఖ్యలో అక్కడికి చేరుకోవడంలో ఎంజీఎం రోడ్డులో హైటెన్షన్ నెలకొంది. ప్రధాన రహదారిపై బైఠాయించిన హిందూ అభిమానులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వరంగల్ నగరంలో అన్య మతస్తులకు చెందిన ఎన్నో కట్టడాలు ప్రధాన రహదారులకు అడ్డంగా ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోని అధికారులు ఏళ్ల చరిత్ర కలిగిన హిందూ దేవాలయంపై రాజకీయ కుట్రలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. హిందూ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు సమాధి కట్టే రోజులు దగ్గర పడ్డాయంటూ నినదించారు. ఆలయానికి చెందిన ప్రహరీనే కాదు అక్కడ ఉన్న ఏ ఒక్క దానిని టచ్ చేసిన అగ్నిగుండం అవుతుందంటూ హెచ్చరించారు. - వరంగల్ వాయిస్, వరంగల్









# టచ్ చేస్తే.. అగ్నిగుండమే

- త్రిశక్తి పీఠం కూల్చేందుకు కుట్ర
- ఎంజీఎం రోడ్ లో హైటెన్షన్
- హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- మద్దతుగా నిలిచిన బీజేపీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఎంజీఎం రోడ్డులోని మహంకాళి త్రిశక్తి పీఠం ప్రహరిని కూల్చేందుకు అధికారులు సిద్ధపడ్డారన్న ప్రచారం దావానలంలా వ్యాపించింది. దీంతో హిందూ ధర్మాభిమానులు, భక్తులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి శక్తి పీఠం పరిరక్షణకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. మహంకాళి త్రిశక్తి పీఠంను టచ్ చేస్తే అగ్నిగుండమే అవుతుందంటూ హెచ్చరించారు. గతంలోనూ కొందరు రాజకీయ నాయకులు స్థానిక బడా వ్యాపారితో కలిసి కుట్రలకు ఆజ్యం పోశారని మండిపడ్డారు. ఓరుగల్లు అన్య మతస్తులకు చెందిన ఎన్నో కట్టడాలు ప్రధాన రహదారులకు అడ్డంగా ఉండి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నా పట్టించుకోని అధికారులు తిశక్తి పీఠం ప్రహరి కూల్చేందుకు మాత్రం మంది మార్బలంతో వచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవునిపై రాజకీయాలు చేయడం మానాలంటూ హితవు పలికారు. ఇటీవలనే నగరంలోని ఓ హిందూ దేవాలయాన్ని కూల్చిన బల్దియా అధికారులు అది మరవక ముందే నగరంలోని అతి ప్రాచీనమైన మరో దేవాలయం ప్రహరీని తొలగించేందుకు సిద్ధపడ్డారంటూ ఆరోపించారు. బల్దియా అధికారులకు హిందూ దేవాలయాలే కనిపిస్తున్నాయా అంటూ ప్రశ్నించారు.

### కాంగ్రెస్ కు రోజులు దగ్గర పడ్డాయి..:

**- గంట రవికుమార్**

హిందూ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు సమాధి కట్టే రోజులు దగ్గర పడ్డాయని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. దేవాదాయ శాఖ మంత్రి ఇలాకలోనే దేవాలయాలకు రక్షణలేదా అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ దేవాలయాల కూల్చివేతలు పెరగడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ అధికారులు హిందూ దేవాలయాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని మండిపడ్డారు. మైనార్టీ ఓట్లకోసం మెజారిటీ ప్రజలైన హిందువుల మనోభావాలతో కాంగ్రెస్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న పైడిపల్లి మైసమ్మ గుడి నేడు శ్రీ త్రిశక్తి పీఠం మహంకాళి గుడి కూల్చివేత అంటూ విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయం చుట్టూ విచ్చలవిడిగా మద్యం షాపులు వెలుస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఆరోపించారు. పోలీసుల అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు.

### రాజకీయాలకు అతీతంగా.. :

**- యెలుగం సత్యనారాయణ**

గోపాలస్వామి గుడి జంక్షన్ ప్రాంతంలోని శ్రీ మహంకాళి త్రిశక్తి పీఠం ప్రహరి కూలగొడుతున్నారన్న సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ప్రచారంతో అన్ని పార్టీల నాయకులతో కలిసి ఒక హిందువుగా మద్దతు తెలిపేందుకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ అన్నారు. ఒక హిందువుగా కాంగ్రెస్ పార్టీ పక్షాన అన్ని పార్టీలతో కలిసి మేము త్రిశక్తి పీఠంనకు అండగా నిలిచామన్నారు. ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అదే విధంగా కొన్ని రాజకీయ పార్టీలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మీద చేస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఇట్టి కార్యక్రమంలో యెలుగం సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ పార్టీ అర్బన్ నాయకులు మబ్బు ప్రవీణ్, తోట వేణు, కొక్కుల సతీష్, బెజగం రజినికాంత్, గోపాలస్వామి గుడి డైరెక్టర్ కాసుల సురేష్, బోగేశ్వర స్వామి గుడి డైరెక్టర్స్ చాగంటి కిరణ్ కూమర్, ముకేష్, గంప రాము, ఎలసని శ్రీమాన్, తదితరులు అలాగే అన్ని పార్టీల నాయకులు, పలు హిందు శాఖల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

### రేపు రాజాసింగ్ రాక..

గోపాలస్వామి గుడి సమీపంలోని మహంకాళి శ్రీ శక్తి పీఠానికి చెందిన ప్రహరిని కూల్చేందుకు అధికారులు సిద్ధపడడాన్ని హిందువులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. బుధవారం ఎంజీఎం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతోపాటు, పలువురు సీనియర్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పద్మశాలి సంఘం ప్రతినిధులు అక్కడికి చేరుకొని నిరసన తెలిపారు. కాగా గురువారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మహంకాళి శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించనున్నారు. దీంతో పోలీసులు భారీ పోలీసు బలగాలను మోహరించారు.


### భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువు..

**- ఎర్రబెల్లి ప్రదీప్ రావు**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని గోపాలస్వామి గుడి సమీపంలోని మహంకాళి శ్రీ శక్తి పీఠాన్ని కూల్చివేయాలనే ప్రయత్నాలు హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్యలని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. శతాబ్దాలుగా భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువుగా ఉన్న ఆలయాలపై ఇలాంటి చర్యలు ఏ విధంగానూ సమర్థించబోమని స్పష్టం చేశారు. హిందూ ఆలయాల జోలికి ఎవరు వచ్చినా, ఎంతటి వారు వచ్చినా ఊరుకునే పరిస్థితి లేదని ఆయన హెచ్చరించారు. ఆలయాన్ని కూల్చే ప్రయత్నాలు వెంటనే నిలిపివేయాలని, సంబంధిత అధికారులు ప్రజల మనోభావాలను గౌరవించి ఆలయ రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంలో అధికారులు పక్షపాత రహితంగా వ్యవహరించి, చట్టపరమైన రక్షణ కల్పించకపోతే హిందూ



సమాజం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందని ప్రదీప్ రావు గారు హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. హిందూ ధార్మిక కట్టడాల పరిరక్షణ ప్రతి ప్రభుత్వపు ప్రాథమిక బాధ్యత అని, భక్తుల విశ్వాసాలపై ఎవరైనా దాడి చేస్తే సహించబోమని స్పష్టం చేశారు.



# చేనేత కార్మికుల వేతనాల పెంపుపై హర్షం

- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన చిప్ప వెంకటేశ్వర్లు నేత

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** తెలంగాణ చేనేత కార్మికుల సహకార సంఘం (టెస్కో)కి వస్త్రోత్పత్తులను సరఫరా చేస్తున్న సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను 30 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంపై టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత హర్షం వ్యక్తం చేశారు. పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలంటూ టెస్కో ఎండీని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. చేనేత కార్మికుల వేతనాలు పెంచాలంటూ పలుమార్లు చేనేత సొసైటీలు, కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో అధ్యయనం చేయించింది. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు అతి తక్కువగా ఉన్న విషయాన్ని వారు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో చేనేత కార్మికుల వేతనాలను 30 శాతం పెంచాలని ప్రతిపాదించారు. దీనికి అనుగుణంగా చేనేత, జౌళిశాఖ నిర్ణయం తీసుకుని ఉత్తర్వులిచ్చింది. ఇప్పటివరకూ కార్మికులకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వేతనం వస్తుండగా.. ఇకపై రూ.7,800 నుంచి రూ.9,100 వరకు రానుంది. పెంపుదలతో 30 వేల మంది కార్మికులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం పేర్కొంది. వేతనాల పెంపుదలకు అనుగుణంగా చేనేత ఉత్పత్తుల ధరలు పెంచుకోవడానికి టెస్కోకు వీలు కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చేనేత, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కార్మికుల పక్షాన చిప్ప వెంకటేశ్వర్లు నేత కృత జ్ఞతలు తెలిపారు.

# అర్హులందరికీ అక్రిడిటేషన్లు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ..
- ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభం
- ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక వెల్లడి




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం జారీ చేసిన జీఓఎంఎస్ నెం.252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్.ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో పాటు డిజిటల్ మీడియా, ఫ్రీలాన్సర్స్, వెటరన్ (సీనియర్) జర్నలిస్టులు కూడా అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన వారు సమాచార శాఖ అధికారిక వెబ్‌సైట్ ipr.telan–gana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 9 నుండే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఎప్పుడైనా తమ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని తెలిపారు.దరఖాస్తు చేసుకునే సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే జర్నలిస్టుల కోసం 9154170881 ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను కేటాయించారు. కార్యాలయ పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగం ప్రతినిధులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆమె జర్నలిస్టులకు సూచించారు.

# వరదలు, విపత్తుల వేళ ధైర్యమే శ్రీరామరక్ష

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- నెల్లుట్ల చెరువు వద్ద 'మాక్ డ్రిల్'



**వరంగల్ వాయిస్, జనగామ:** అకాల వర్షాలు, వరదలు వంటి విపత్కర పరిస్థితులు సంభవించినప్పుడు ప్రజలు భయపడకుండా, ప్రాణనష్టాన్ని ఎలా నివారించాలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల చెరువు వద్ద హైదరాబాద్‌కు చెందిన 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ సంయుక్తంగా నిర్వహించిన భారీ మాక్ డ్రిల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్, ఏఎస్సై రొడ్డా మద్దిలెట్టి బృందం వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడే విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపారు. వరదల్లో చిక్కుకున్నప్పుడు ఈత రాని వారు స్థానికంగా దొరికే వస్తువులతో ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో వివరించారు. నీటిలో మునిగిన వారిని బయటకు తీసిన వెంటనే మెడికల్ టీమ్ అందించాల్సిన అత్యవసర చికిత్సపై అవగాహన కల్పించారు. గృహాల్లో గ్యాస్ లీకేజీ లేదా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించే తీరును ప్రదర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎన్డీఆర్ఎఫ్, మెడికల్, ఫైర్ విభాగాల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి మాక్ డ్రిల్స్ వల్ల ప్రజల్లో ఉన్న భయం పోయి తక్షణమే స్పందించే ధైర్యం వస్తుందని పేర్కొన్నారు. విపత్తు నివారణ చర్యలను ప్రతి ఒక్కరూ సులభంగా అర్థం చేసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డీవో గోపిరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు. అలాగే సీజేటీలో శిక్షణలో ఉన్న చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, జాఫర్‌గఢ్, రఘునాథపల్లి, లింగాల ఘనపూర్ మండలాల సర్పంచులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

# ఆడబిడ్డలకు సర్పంచ్ కానుక

## పెళ్లి ఖర్చులకు రూ.20 వేలు అందజేత



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఒగ్లాపూర్ గ్రామ సర్పంచ్ కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. గ్రామ చెందిన ఆకుల రజిత రవీందర్ మరొక్క కుటుంబానికి కళావతి రవీందర్ కూతురి పెళ్లికి మానవీయ దృక్పథంతో స్పందించి ఆర్థిక సహాయం అందజేశారు. వివాహాన్ని పురస్కరించుకుని, సర్పంచ్ శ్రీధర్ రెడ్డి తను సొంతంగా రూ.20.000 పెళ్లి కానుకగా అందజేశారు. వారి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగదును కుటుంబ సభ్యులకు అందజేసి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తన కుటుంబ , వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తున్న సర్పంచ్ తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భువనేశ్వర్ జాతీయ సదస్సుకు సీనియర్ సిటిజన్లు

## వృద్ధుల సంక్షేమం, రైల్వే రాయితీలపై కీలక చర్చలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఒడిస్సా రాజధాని భువనేశ్వర్‌లో ఈ నెల 22, 23 తేదీలలో జరగనున్న 23వ అఖిల భారత జాతీయ సీనియర్ సిటిజన్స్ సమావేశానికి వరంగల్ జిల్లా నుంచి భారీ బృందం తరలివెళ్తోంది. జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి, సహాయ కార్యదర్శి ఏ.రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో పాల్గొనేందుకు వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 34 మంది ప్రతినిధులు ఎంపికయ్యారు. వీరిలో వరంగల్ నగరం నుంచి 13 మంది, నర్సంపేట నుంచి 12 మంది, చెన్నారావుపేట నుంచి 9మంది వెళ్లనున్నారు. ఈ బృందం ఈ నెల 19న వరంగల్ రైల్వే స్టేషన్ నుండి ప్రయాణం కానుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఒడిస్సా రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. వయోవృద్ధులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సవాళ్లు, కుటుంబం, సమాజంలో వారి బాధ్యతలపై లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యంగా "తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ – సంరక్షణ చట్టం 2007" పై ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన పలు కీలక అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. గతంలో అమల్లో ఉన్న 40 శాతం రైల్వే రాయితీని పునరుద్ధరించాలి. ప్రతి జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అనాథ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలి. వృద్ధులను గౌరవంగా చూసుకోవడం కుటుంబ సభ్యుల ప్రాథమిక బాధ్యతగా ఉండాలి. వృద్ధుల సంక్షేమాన్ని ప్రభుత్వం సామాజిక బాధ్యతగా స్వీకరించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చర్యలు తీసుకోవాలి. వృద్ధుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జరగనున్న ఈ సదస్సులో వరంగల్ ప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించనున్నారని మల్లారెడ్డి తెలిపారు.

# 28న 'రుద్రమ' మోడల్ రాకెట్ ప్రయోగం

## కుడా, నిట్ సహకారంతో అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28న వరంగల్ నగరంలో "రుద్రమ" మోడల్ రాకెట్ లాంచింగ్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. యువ శాస్త్రవేత్త భూపతి శశాంక్ ఆధ్వర్యంలో, కుడా , నిట్ వరంగల్ సహకారంతో అవగాహన సదస్సు జరగనుంది. ఫిబ్రవరి 28 సాయంత్రం 5 గంటలకు హన్మకొండలోని హైగ్రీవాచారి కాంపౌండ్ లో "రుద్రమ" మోడల్ రాకెట్ లాంచింగ్ ప్రదర్శన చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కాళోజీ కళాక్షేత్రంలో ఇస్రో శాస్త్రవేత్తలచే అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని భావించిన జిల్లా విద్యాశాఖాధికారి, వరంగల్ జిల్లాలోని పాఠశాలలకు ప్రత్యేక ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు శ్రీనివాస్ వెల్లడించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైన్స్ డే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 27 వరకు భద్రకాళి ట్యాంక్ బండ్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పగలు (ఉదయం 11 – సాయంత్రం 5) సూర్యునికి సంబంధించిన విశేషాల పరిశీలన. రాత్రి (6 నుంచి 9 గంటల వరకు) టెలిస్కోప్ ద్వారా నక్షత్రాలను వీక్షించే స్టార్ గేజింగ్ కార్యక్రమం, ఆసక్తి గల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులను తీసుకువచ్చే ఉపాధ్యాయులు పిల్లల భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీనివాస్ సూచించారు. "శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తి పెరిగితేనే దేశ ప్రగతి సాధ్యం" అని పేర్కొన్న ఆయన, ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రింట్ ,యు ఎలక్ట్రానిక్ మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

# శశిరేఖ చిత్రపటానికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, దేవరుప్పల :** మండలంలో మూడు దశాబ్దాలుగా జర్నలిస్టుగా సేవలందిస్తున్న మాదంశెట్టి వేణుమాధవ్ గుప్తా అత్త కందుకూరి శశిరేఖ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇంచార్జి, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుధవారం జనగామ జిల్లా దేవరుప్పల మండలం సీతారాంపురం గ్రామంలో నిర్వహించిన శశిరేఖ దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శశిరేఖ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కృష్ణమూర్తి మాట్లాడారు. శశిరేఖ మరణం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రమేష్ శర్మ, నల్ల లక్ష్మీపతి, సందీప్, గోవర్ధన చారి, సారయ్య, వేణుమాధవ్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వ మల్లేష్ గౌడ్, హనుమంతు, ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్ జంపాల సంపత్ కుమార్, మృతురాలి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొని నివాళులర్పించారు.

# వసతి గృహాల సందర్శన



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆకాంక్షించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. హాస్టళ్లను సందర్శించిన సర్పంచ్, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న భోజనం, వసతులు, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తూ భోజనం నాణ్యతను పరిశీలించారు. వసతి గృహాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వార్డెన్లను కోరారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా 'ఆల్ ఇన్ వన్' స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రతిరోజూ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, బీసీ హాస్టల్ వార్డెన్ వీరన్న నాయక్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ సంపత్, నాయకులు బొల్లంపల్లి శ్యామ్, సతీష్ పాల్గొన్నారు.

# అప్పయ్యపల్లిలో సర్పంచ్ ఆకస్మిక తనిఖీలు

- మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, గణపురం:** గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అప్పయ్యపల్లి గ్రామ సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్ ముమ్మరంగా పర్యటించారు. బుధవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సర్పంచ్, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని నిర్వాహకులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని సర్పంచ్ అడిగి తెలుసుకున్నారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున అందుతున్న ఈ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం, గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని రిజిస్టర్లను తనిఖీ చేశారు. 18 ఏళ్లు నిండిన కిశోర బాలికలకు అందుతున్న ఆహార పదార్థాల పంపిణీపై ఆరా తీశారు. గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతున్న సర్పంచ్ రమేష్ తీరుపై గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి చంద్రగిరి రాకేష్, కారోబార్ రాజు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, దామెర :** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ఆటో డ్రైవర్ ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్న విషాదకర సంఘటన దామెర మండల పరిధిలోని పసరగొండ గ్రామంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పసరగొండ గ్రామానికి చెందిన తీగుల్ల చేరాలు (44) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఆయనకు భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె బి.ఫార్మసీ చదువుతుండగా, చిన్న కుమార్తె 5వ తరగతి చదువుతోంది. పదేళ్ల క్రితం ఇల్లు కట్టుకోవడం, పిల్లల చదువులు, కుటుంబ అవసరాల కోసం చేరాలు పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. ఈ క్రమంలోనే మూడేళ్ల క్రితం తన ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టి లోన్ తీసుకోవడమే కాకుండా, ఇంట్లోని బంగారాన్ని కూడా కుదువపెట్టాడు. గత రెండు నెలలుగా ఆటో సరిగా నడవకపోవడంతో ఫైనాన్స్ కిస్తీలు కట్టడం భారంగా మారింది. అప్పులు తీర్చే మార్గం కనిపించక, తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన క్షణికావేశంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. బుధవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులందరూ నిద్రపోతున్న సమయంలో, చేరాలు ఇంటి బయట ఉన్న రేకుల షెడ్డుకు తాడుతో ఉరివేసుకున్నాడు. ఉదయం 5:45 గంటల ప్రాంతంలో నిద్రలేచిన భార్య జ్యోతి, భర్త విగతజీవిగా వేలాడటం చూసి కన్నీరుమున్నీరైంది. మృతుడి భార్య తీగుల్ల జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దామెర ఏఎస్ఐ కె.రమేష్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చేరాలు మృతితో పసరగొండలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి హామీ కూలీలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో పుట్టగొడుగుల పెంపకం, మార్కెటింగ్ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న వారిలో 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు ఉండి, కనీసం 60 రోజుల పని దినాలు పూర్తి చేసిన వెజ్ సీకర్స్ కు ఈ శిక్షణ కల్పిస్తున్నారు. ఆత్మకూరు, దామెర మండలాల నుంచి ఎంపిక చేసిన అభ్యర్థులు ఇందులో పాల్గొంటున్నారు. ఈ శిక్షణా కార్యక్రమం పది రోజుల పాటు నిరంతరాయంగా సాగుతుంది. పుట్టగొడుగులను శాస్త్రీయ పద్ధతిలో పెంచడం, వాటిని నిల్వ చేయడం మరియు మార్కెట్లో విక్రయించే మెళకువలను అభ్యర్థులకు నేర్పిస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఎస్బీఐ, హసన్‌పర్తి బ్రాంచ్, ఆర్-సెటి ఆధ్వర్యంలో అధికారిక సర్టిఫికెట్లను అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, దామెర మండలాల ఏపీవోలు రాజిరెడ్డి, శారద, జీడీఎం డీఆర్డీఏ శ్రీనివాస్, డీపీ ఇంగ్లీష్ ట్రైనీలు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

# వార్డును పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, జనగామ:** మున్సిపల్ పరిధిలోని పౌర సేవలు అందించడంలో, వార్డును పరిశుభ్రంగా ఉంచడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించబోమని 3వ వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి స్పష్టం చేశారు. బుధవారం ఆమె వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. వార్డులోని శానిటేషన్ కార్మికులతో మాట్లాడిన కౌన్సిలర్, వీధుల్లో చెత్త నిల్వలు ఉండకుండా చూడాలని, మురుగునీరు నిలిచి దోమలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వార్డులోని బాలాజీ నగర్ రెండో గల్లీలో డ్రైనేజీ పూడికపోయి మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన కౌన్సిలర్, తక్షణమే స్పందించారు. జేసీబీ సహాయంతో కచ్చా కాలువను తవ్వించి, మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, కాంగ్రెస్ నాయకురాలు ఎండీ నజీమా, సీపీఎం శాఖ సెక్రెటరీ గుండు శశిరేఖ, రిటైర్డ్ ఉపాధ్యాయులు మాసంపల్లి నరసయ్య, సత్తయ్య, కాలనీవాసి గజ్జల నగేష్ రెడ్డి, వార్డు ఫీల్డ్ జవాన్ ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అనుకోని భేటీ.. ఆత్మీయ పలకరింపు

◆ ఎంపీ కడియం కావ్యకు వేం నరేందర్ రెడ్డి అభినందనలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** వరంగల్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంపై ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోవడంలో ఎంపీ కడియం కావ్య సమర్థవంతంగా వ్యవహరించారని వేం నరేందర్ రెడ్డి కొనియాడారు. ముఖ్యంగా తొర్రూరు మున్సిపాలిటీలో పార్టీ విజయం సాధించడాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేసినందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా రెడ్డియాల పర్యటనలో ఉన్న వేం నరేందర్ రెడ్డికి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య బృందం అనుకోకుండా ఎదురైంది. కడియం శ్రీహరి బావగారి దశదిన కర్మ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తుండగా ఈ భేటీ జరిగింది. ఈ క్రమంలో ఇరుపక్షాలు వాహనాలను నిలిపి, పరస్పరం కుశలప్రశ్నలు వేసుకున్నారు. రాజకీయాలతో పాటు పలు అంశాలపై కాసేపు ఆత్మీయంగా, సరదాగా మాట్లాడుకున్నారు. అకస్మాత్తుగా కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలను చూసి వేం నరేందర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ భేటీలో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రు నాయక్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలనే సదాశయంతో కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో జీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గాజుల రమేష్ (చిన్న) స్పాన్సర్‌షిప్‌తో నిర్వహిస్తున్న ఈ క్రీడలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, స్థానిక ఎస్సై మధు కలిసి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న తరుణంలో, "డ్రగ్స్ వద్దు - గ్రౌండ్ ముద్దు" అనే నినాదంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా క్రమశిక్షణకు తోడ్పడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండపు చరణ్ పటేల్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్, రాజగొల్ల రాజు, అనిల్, వెంగళ శివానందం, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


# విద్యార్థుల్లో వైజ్ఞానిక తృష్ణను పెంచాలి

ఎంఈవో ఆంగోత్ లక్ష్మ



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని, నిత్యజీవితంలో భౌతిక శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని మండల విద్యాశాఖ అధికారి ఆంగోత్ లక్ష్మ అన్నారు. బుధవారం డోర్నకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎఫ్ పీఎస్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి భౌతిక శాస్త్ర పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మూస పద్ధతిలో కాకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని కోరారు. మండలంలోని పీఎం శ్రీ డోర్నకల్, జడ్పీహెచ్ఎస్ కన్నెగుండ్ల, ములకలపల్లి, కేజీబీవీ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం ప్రధానోపాధ్యాయులు బండి నర్సింహారావు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డోర్నకల్, ద్వితీయ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ములకలపల్లి, తృతీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్, కన్నెగుండ్ల నిలిచారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ కోవిలాల రాజేశ్వర్, ఉపాధ్యాయులు సునీల్, శంకర్, మంజులత, అరుణ, వసంత రాణి, సాహెబ్ అలీ, వరలక్ష్మి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# రంజాన్ మాసంలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రేపటి నుంచి ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్ అధికారులను ఆదేశించారు. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సూచనల మేరకు బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి ఆయన 17 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. రంజాన్ మాసం మొత్తం మసీదులు, ఈద్గాలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని స్పష్టం చేశారు. అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి మసీదుల వద్ద విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తక్షణమే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. కేవలం సరఫరా మాత్రమే కాకుండా, విద్యుత్ భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రంజాన్ మాసంలో వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి అధికారి, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ ఇంజనీర్లు కె.రాజు చౌహన్, అశోక్, వివిధ విభాగాల జీఎంలు, 17 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు పాల్గొన్నారు. రంజాన్ ప్రార్థనల సమయంలో ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తాయని అధికారులు వెల్లడించారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామమే లక్ష్యం

● ఎల్కతుర్తి దామెరలో అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మండల సమైక్య ప్రాజెక్ట్ మేనేజర్ కవిత పిలుపునిచ్చారు. బుధవారం ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో అంతర్జాతీయ ఏసెజ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై గ్రామ స్థాయి విలేజ్ ఆర్గనైజేషన్ సభ్యులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించడంతో పాటు, భవిష్యత్తు తరాలకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఏసెజ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, దామెరను ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ ఆర్గనైజేషన్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను వాడాలని, పర్యావరణానికి ముప్పు కలిగించే వస్తువులను దూరంగా ఉంచాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# డీసీసీబీ ఎన్‌పీఏ 5 శాతంలోపు ఉండాలి



- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- బ్యాంకు ఆర్థిక స్థితిగతులపై 'రిస్క్ మేనేజ్‌మెంట్ కమిటీ' సమీక్ష
- మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని బ్యాంకు పర్సన్ ఇంఛార్జి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన బ్యాంకు రిస్క్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బ్యాంకు మూలధనం, డిపాజిట్లు, పెట్టుబడులు, రుణాల వసూళ్లపై సమగ్ర సమీక్ష చేపట్టారు. బ్యాంకు వనరుల వినియోగం, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో కలెక్టర్ విస్తృతంగా చర్చించారు. బ్యాంకు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి అవసరమైన వ్యూహాలను అమలు చేయాలని సూచించారు. బ్యాంకు పురోగతిలో కీలకమైన మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా బ్యాంకు యొక్క ఎన్‌పీఏ స్థాయిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన ప్రామాణిక రేటు కంటే తక్కువగా, అంటే 5 శాతం లోపు ఉంచాలని స్పష్టం చేశారు. ఇందుకోసం సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేసి, రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. బ్యాంకు ఆర్థిక స్థిరత్వం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిస్క్ మేనేజ్‌మెంట్ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ, బ్యాంకు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో గిరిజన బిడ్డల గర్జన..

- 'స్టెమ్-60' అద్భుత విజయం
- తొలి ఏడాదిలోనే 53.57 శాతం ఉత్తీర్ణతతో రికార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న స్టెమ్-60 కోచింగ్ సెంటర్ జేఈఈ మెయిన్స్-2026 ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది. హనుమకొండ బాలసముద్రంలోని ఎస్టీ స్టడీ సర్కిల్ వేదికగా శిక్షణ పొందిన విద్యార్థులు, కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించి గిరిజన బిడ్డల సత్తాను చాటారు. పూర్వ వరంగల్ జిల్లాలోని గిరిజన విద్యార్థులకు జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో గత ఆగస్టులో ఈ ప్రత్యేక కోచింగ్ ప్రారంభమైంది. శిక్షణ పొందిన 28 మంది విద్యార్థులలో 15 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఇందులో ఐదుగురు విద్యార్థులు నేరుగా ఎన్ఐటీ లలో ప్రవేశం పొందే స్థాయి పర్సంటైల్ సాధించడం విశేషం. 53.57% ఉత్తీర్ణతతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఇతర ప్రైవేట్ శిక్షణ సంస్థల కంటే మెరుగైన ఫలితాలను సాధించి అగ్రగామిగా నిలిచింది. ఐటీడీఏ ఏటూరునాగారం మరియు గిరిజన సంక్షేమ శాఖ సమన్వయంతో సాగుతున్న ఈ స్టెమ్-60 ప్రాజెక్టులో విద్యార్థులకు పూర్తి ఉచితంగా నివాస సౌకర్యం, పౌష్టికాహారం, సీనియర్ ఫ్యాకల్టీతో శిక్షణ అందిస్తున్నారు. స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపికైన ఏటూరునాగారం సహా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. గతంలోనూ పేద గిరిజన విద్యార్థులకు ఫీజులు, ల్యాప్‌టాప్‌లు అందించి అండగా నిలిచిన ఐటీడీఏ, ఇప్పుడు ఈ ఫలితాలతో మారుమూల ప్రాంతాల్లోని విద్యా పునాదులను మరింత బలోపేతం చేసింది. రాబోయే 2026-27 విద్యా సంవత్సరానికి కూడా తదుపరి బ్యాచ్ ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో గిరిజన విద్యార్థులు అడుగుపెట్టడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. విజయం సాధించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపక బృందాన్ని మరియు అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

# హైకోర్టు ప్యానెల్ లాయర్‌గా 'మద్దెల రవీందర్'



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది మద్దెల రవీందర్ అత్యున్నత గౌరవాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ లాయర్‌గా ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు ఫిబ్రవరి 1, 2026 నుంచి ఆయన నియామకం అమల్లోకి వచ్చినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. మద్దెల రవీందర్ గత ఆరు సంవత్సరాలుగా తెలంగాణ హైకోర్టులో విజయవంతంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన ముఖ్యంగా రాజ్యాంగ, క్రిమినల్, సర్వీస్ న్యాయ అంశాలలో విశేష అనుభవం గడించారు. సామాన్యులకు న్యాయం చేకూర్చడంలో ఆయన చూపుతున్న ప్రతిభను గుర్తించి ఈ కీలక బాధ్యతను అప్పగించారు. రవీందర్ తన ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసాన్ని వరంగల్ నగరంలోనే పూర్తి చేశారు. ఇక్కడి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ఉన్నత స్థాయికి ఎదగడం పట్ల స్థానిక న్యాయవాదులు, స్నేహితులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ బిడ్డగా రాష్ట్ర స్థాయి ప్యానెల్‌లో చోటు సంపాదించడం జిల్లాకు గర్వకారణమని వారు కొనియాడారు. ప్యానెల్ లాయర్‌గా ఎంపికైన రవీందర్ గారిని పలువురు ప్రముఖులు అభినందిస్తూ, ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# చేనేతలకు 30 శాతం వేతనాల పెంపు

ముఖ్యమంత్రికి 'పోపా' కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల వేతనాలను 30 శాతం పెంచుతూ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంపై తెలంగాణ పద్మశాలి ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర క్యాబినెట్ మంత్రివర్గానికి పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో చేనేత కార్మికుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే దిశగా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని శ్రీనివాస్ పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఇబ్బందుల్లో ఉన్న చేనేత కుటుంబాలకు ఈ 30 శాతం వేతనాల పెంపు ఎంతగానో వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. "చేనేత రంగం పట్ల, పద్మశాలి కులవృత్తుల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న సానుకూల దృక్పథం అభినందనీయం. చేనేత కార్మికుల శ్రమకు తగిన గుర్తింపునిస్తూ వేతనాలు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పద్మశాలి సమాజం తరపున, పోపా సంస్థ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాము" అని శామంతుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కడవెండి వాసికి ప్రతిష్ఠాత్మక పురస్కారం



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, సీనియర్ ఫొటోగ్రాఫర్ గుమ్మడవెల్లి సోమన్న ప్రతిష్ఠాత్మక 'పద్మా చక్ర' అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ప్రగతీ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల 22న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రధానం చేయనున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సోమన్న చురుకైన పాత్ర పోషించారు. సకల జనుల సమ్మె, వంటా-వార్పు, రాస్తారోకో వంటి పోరాటాల్లో పాల్గొని తన గళాన్ని వినిపించారు. వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్‌గా కొనసాగుతూనే, సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పలు లఘు చిత్రాలను నిర్మించి విశేష గుర్తింపు పొందారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవం దక్కింది. సోమన్నకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడం పట్ల కడవెండి గ్రామస్థులు, పద్మశాలి సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామ కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటినందుకు ఆయనను అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ.. తన సామాజిక సేవను గుర్తించి 'పద్మా చక్ర' పురస్కారానికి ఎంపిక చేసిన వల్లూరి ఫౌండేషన్ అధినేత సీవీ శ్రీనివాస్ రాజుకు, ఇతర నిర్వాహక సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు.

# పరీక్షల నిర్వహణలో సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల కోసం 52 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి సంవత్సరం 18,590 మంది, రెండో సంవత్సరం 20,004 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతి సెంటర్‌లో 2 నుండి 3 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సెల్ ఫోన్లను కఠినంగా నిషేధించాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల కోసం జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, మొత్తం 12,079 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్రాలలో తాగునీరు, శానిటేషన్ మరియు విద్యుత్ వంటి మౌలిక వసతులలో ఎటువంటి లోటు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. కస్టోడియన్ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న పత్రాలను క్షేత్రస్థాయికి చేరవేయాలని తెలిపారు. పరీక్ష నిబంధనలపై విద్యార్థులకు ముందే అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ, పోలీస్, ఆర్టీసీ, ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి


- మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే నాయిని వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి
- త్వరలోనే నిధుల విడుదల



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు పెండింగ్ పనులు, నూతన రహదారుల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను ఈ సందర్భంగా మంత్రికి సమర్పించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు, ప్రధాన మార్గాల మరమ్మతులు, నూతన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సంబంధించిన అవసరాలను ఎమ్మెల్యే నాయిని మంత్రికి వివరించారు. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు దెబ్బతినడం వల్ల ప్రజలు రాకపోకలకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే అందజేసిన ప్రతిపాదనలను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఉందని, నిధుల విడుదలపై సంబంధిత అధికారులతో చర్చించి దశలవారీగా పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నట్లు సమాచారం. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రోడ్లు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రహదారుల అనుసంధానంపై కూడా ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

# ఓటర్ జాబితా మ్యాపింగ్ వేగవంతం చేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయితో కలిసి తహసీల్దార్లు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా 2025 ఓటర్ జాబితాను 2002 ఎస్.ఐ.ఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రతి బీఎల్వో రోజుకు కనీసం 50 మంది చొప్పున మ్యాపింగ్ పూర్తి చేసేలా ఆర్డీవోలు పర్యవేక్షించాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను




ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఎలక్షన్ డీటీ రంజిత్, సంబంధిత మండలాల తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రుణ లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలి

- రికవరీపై ఏపీఎంలు, సీసీలు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో జాప్యం వద్దు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ :** మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అర్హులైన వారందరికీ అందజేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్త్రీ నిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ పనితీరు, ఆర్థిక ప్రణాళికలు, బ్యాంక్ లింకేజీ రుణాలపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉన్నందున, ఏపీఎంలు, సీసీలు తమకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవడంలో వేగం పెంచాలని సూచించారు. రుణాల రికవరీ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, క్రెడిట్ ప్లాన్ అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. స్త్రీ నిధి రుణాల పంపిణీలో 100 శాతం ప్రగతి సాధించాలని ఆదేశించారు. బ్యాంక్ లింకేజీ రుణాల విషయంలో ప్రతి మండలం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎల్‌డీఎం, ఏపీడీలు సంయుక్తంగా బ్యాంక్ అధికారులతో సమన్వయం చేసుకొని, మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న రుణాలను 15 రోజుల్లోగా మంజూరు అయ్యేలా చూడాలన్నారు. బ్యాంక్ అధికారులతో చర్చించి ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ వసంత, ఏపీడీ నూరిద్దన్, జిల్లా సమైక్య అధ్యక్షులు, ఓబీ సభ్యులు, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ ప్రమీల, అసిస్టెంట్ మేనేజర్లు, అన్ని మండలాల ఏపీఎంలు, సీసీలు, జనగామ, స్టేషన్ ఘనపూర్ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి..

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు, మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీలతో కలిసి రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణపై సమీక్ష నిర్వహించారు. రోడ్డు భద్రత అనేది కేవలం ఒక శాఖకు సంబంధించిన అంశం కాదని, ప్రాణనష్టాన్ని నివారించడం అందరి బాధ్యతని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వీధి దీపాలు నిరంతరం వెలిగేలా చూడాలని సూచించారు. రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధప్రతిపాదికన పూడ్చివేయాలని, వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా పెద్ద సైజు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు.సర్పంచులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల్లో మరియు ప్రతి బుధవారం జరిగే 'ఉజ్వల' కార్యక్రమంలో పోలీస్ అధికారులు మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక సెషన్లు తీసుకోవాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సరఫరాను అరికట్టేందుకు పోలీస్ మరియు ఎక్సైజ్ శాఖలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలన్నారు. విక్రయదారులకు పడే శిక్షల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో రోడ్డు మరియు భవనాల శాఖ, రవాణా శాఖ, పోలీస్, నేషనల్ హైవే, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కొండా మురళికి ఆహ్వానం

**ఈ నెల 23 నుంచి మార్చి 9 వరకు వేడుకలు**



**వరంగల్ వాయిస్, వరంగల్:** గీసుగొండ మండలం, కొమ్మాలగుట్టలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు కొండా మురళిని మర్యాదపూర్వకంగా కలుసుకుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 23 నుంచి మార్చి 09 వరకు కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. 'కొమ్మాల జాతర' అంటేనే స్థానికంగా 'కొండా మురళి జాతర'గా ప్రతీతి ఉన్న నేపథ్యంలో, ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారం అందించాలని ఈ సందర్భంగా విన్నవించారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. కొండా మురళి ఆహ్వానం పట్ల సానుకూలంగా స్పందిస్తూ, బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.






# ది కేరళ స్టోరీ సీక్వెల్..

### సంచలనం సృష్టిస్తున్న ట్రైలర్

2023లో బాక్సాఫీస్ వద్ద వివాదాలు సృష్టించిన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ' ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో పెను దుమారం రేపుతోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత వివాదాస్పదంగా, అత్యంత తీవ్రమైన అంశాలతో రూపొందినట్లు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్ ఇస్లామిక్ రాజ్యంగా మారుతుంది అనే వివాదాస్పద డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభంకాగా.. ఈసారి దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కథను కేవలం కేరళకే పరిమితం చేయకుండా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలను ఇందులో చూపించారు. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రంలో గతంలో నటించిన అదా శర్మ స్థానంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రలు పోషించారు. మత మార్పిడికి నిరాకరించిన యువతులను చిత్రహింసలకు గురిచేయడం, బలవంతంగా గొడ్డు మాంసం తినిపించడం వంటి కఠినమైన దృశ్యాలను మేకర్స్ ఈ ట్రైలర్‌లో పొందుపరిచారు. అయితే ఈ ట్రైలర్‌పై కేరళ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బలవంతంగా గొడ్డు మాంసం తినిపించే సన్నివేశంపై వారు మండిపడుతున్నారు. కేరళలో బీఫ్‌ను అందరూ ఇష్టంగా తింటారని, ఎవరికీ బలవంతంగా తినిపించాల్సిన అవసరం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమా సమాజంలోని చేదు నిజాలను ధైర్యంగా చూపిస్తోందని మరికొందరు సమర్థిస్తున్నారు.

# చాలాకాలం రుచి, వాసన శక్తిని కోల్పోయా

తన అనారోగ్యంపై మమ్ముట్టి తొలిసారి వివరణ మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి తన అనారోగ్యంపై వస్తున్న వార్తలపై తొలిసారి స్పందించాడు. గత ఏడాది జూన్ సమయంలో ఆయన అనారోగ్యానికి గురై దాదాపు నాలుగు నెలల పాటు సినిమాలకు విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. తాను చాలా కాలం పాటు రుచి, వాసన చూసే శక్తిని కోల్పోయానని, ఇప్పుడి ప్పుడే నెమ్మదిగా ఆ ఇంద్రియ జ్ఞానాన్ని తిరిగి పొందుతున్నానని తెలిపారు. కంటి చూపు, వినికిడితో పాటు శ్వాస తీసుకునేటప్పుడు వాసనను గుర్తించగలగడం కూడా ఒక గొప్ప వరమని, అటువంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడే వాటి విలువ అర్థమవుతుందని ఆయన భావోద్వేగంగా మాట్లాడారు. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బ్జడెట్ చిత్రం 'పేట్రియాట'. ఈ సినిమా కోసం మమ్ముట్టి ఇటీవలే డబ్బింగ్ పనులను కూడా పూర్తి చేశారు. ఈ సినిమా మలయాళ చిత్ర పరిశ్రమలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలవనుంది. ఎందుకంటే సుమారు 18 ఏళ్ల తర్వాత మమ్ముట్టి, మోహన్ లాల్ కలిసి పూర్తిస్థాయి పాత్రల్లో స్క్రీన్‌ను పంచుకుంటున్నారు. వీరిద్దరితో పాటు విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్ విలన్‌గా నటిస్తుండటం విశేషం. నయనతార, కుంచాకో బోబన్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# నాకు శక్తి..ప్రేరణ అన్నీ సురేఖయే






### భార్య పుట్టిన రోజు చిరు ఎమోషనల్ పోస్ట్

మెగాస్టార్ చిరంజీవి తన సతీమణి సురేఖ పుట్టినరోజు మరియు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్‌ను పంచుకున్నారు. తన సినీ ప్రయాణంలోనే కాకుండా, జీవిత ప్రయాణంలోనూ తనకు అండగా నిలిచిన సురేఖపై తనకున్న అపారమైన ప్రేమాభిమానాలను ఆయన ఈ సందర్భంగా చాటుకున్నారు.

1980 ఫిబ్రవరి 20న వివాహం చేసుకున్న ఈ జంట త్వరలోనే 46వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనుండగా, సురేఖ తన విజయాల వెనుక ఉన్న అసలు శక్తి అని చిరంజీవి కొనియాడారు. తన ప్రతి అడుగులో వెంట నడిచిన సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె తమ కుటుంబానికి కేంద్రబిందువని, అందరినీ ప్రేమానురాగాలతో ఒక్కటిగా ఉంచే శక్తి ఆమెకే ఉందని చిరంజీవి పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులను సొంతవారిగా భావించి, తల్లిదండ్రులకు కన్నకూతురిగా మారిపోయిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు. తన సక్సెస్ గురించి ఎవరైనా అడిగితే అది కేవలం తన టాలెంట్ వల్లనో, కష్టం వల్లనో వచ్చినది కాదని, అది పూర్తిగా సురేఖ వల్లే సాధ్యమైందని చిరంజీవి స్పష్టం చేశారు. ఇంటి బాధ్యతలన్నింటినీ ఆమె భుజాన వేసుకోవడం వల్లే తాను ఎటువంటి ఆందోళన లేకుండా వృత్తిపై దృష్టి పెట్టగలిగానని, ఏ సంక్షోభంలోనైనా తమను కలిపి ఉంచే బలం ఆమె అని ఆయన ఎమోషనల్ అయ్యారు. 'నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే దానికి కారణం నువ్వే' అంటూ తన మనసులోని మాటను హృద్యంగా పంచుకున్న ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. మెగా అభిమానులు, సినీ ప్రముఖులు సురేఖ కొణిదెల గారికి పెద్ద ఎత్తున పుట్టినరోజు మరియు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# అక్కినేని ప్రేమాభిషేకానికి 45 ఏళ్లు పూర్తి

అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే ఐకానిక్ సినిమా 'ప్రేమాభిషేకం'. అప్పట్లో ఇది సిల్వర్ జూబ్లీ జరుపుకుంది. దేవదాసు తరవాత మళ్లీ అంతటి సినిమాగా ప్రాచుర్యం పొందింది. ఈచిత్రం విడుదలై 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక వీడియోను పంచుకుంది. లక్షల మంది హృదయాల్లో ఏఎన్నార్ ఎప్పటికీ జీవించే ఉంటారని పేర్కొంది.




# మెరుగైన సేవలు అందించాలి

- ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారదా
- వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి సిబ్బంది బయోమెట్రిక్ విధానం ద్వారా సమయపాలన పాటిస్తూ విధులకు హాజరై ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని లెక్టర్ డాక్టర్ సత్య శారదాఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ సత్య శారదా అధ్యక్షతన వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు, వైద్య సలహాలు సమగ్రంగా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నివారణ, మాతా–శిశు సంరక్షణ, రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం, కిశోర ఆరోగ్య కార్యక్రమం తదితర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనధికారిక సిజేరియన్ ఆపరేషన్లు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్య రంగంలో పారదర్శకత, నాణ్యత, ప్రజలకు సులభ ప్రాప్తి లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తూ, విధి నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇగ్భత్ అహ్మద్, డాక్టర్ సరిత, డాక్టర్ ప్రసన్నలక్ష్మి, డాక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### చిత్తడి నేలల కమిటీ సమావేశం..

జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా స్థాయి చిత్తడి నేలల కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీ అనూస్ అగర్వాల్ (మెంబర్ కన్వీనర్) పాల్గొనగా, గత సమావేశం అనంతరం జరిగిన పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గుర్తించిన రెండు వెట్‌లాండ్స్‌కు సంబంధించిన పలు కీలక సమాచారం, పత్రాలు వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా అటవీ అధికారి వివరించారు. ముఖ్యంగా ముసలమ్మ కుంట (వరంగల్ రేంజ్) మరియు వెంకటాపూర్ పెద్ద చెరువు (నర్సంపేట రేంజ్)లకు సంబంధించి రెవెన్యూ, సాగునీరు, మత్స్య, పర్యాటక శాఖల నుండి అవసరమైన నివేదికలు ఇంకా అందాల్సి ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# దత్త క్షేత్రంలో శ్రీ కార్యసిద్ధి హనుమత్ ప్రతిష్ఠ

☐ 19, 20 తేదీల్లో ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** నగరంలో ప్రముఖ అధ్యాత్మిక క్షేత్రమైన శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో ఎస్జీఎస్ దత్త జ్ఞాన బోధ సభ వరంగల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 19, 20 తేదీలలో ఆశ్రమంలో సభా మండపంకు శంకు స్థాపన, పనులు ప్రారంభంతోపాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దత్త క్షేత్రంలో నూతన సభా మండపం నిర్మాణం నేపథ్యంలో ఆశ్రమంలో ఉన్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామీ వారి ఆలయం మార్పు జరుగనుందని వెల్లడించారు. 19 తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు మైసూరు అవధూత దత్త పీఠం నుంచి బ్రహ్మశ్రీ కళ్యాణ్ శర్మ, వారి పరివారంచే శ్రీ హనుమత్ హోమం, సాయంత్రం 5 గంటలకు శ్రీ కార్య సిద్ధి ఆంజనేయ స్వామి మూలమూర్తి కళాపకర్షణ (తాత్కాలికంగా వేరేచోట ప్రతిష్ఠ), 6.30 గంటలకు హోమం పూర్ణాహుతి, 7.30 గంటలకు శ్రీ హనుమాన్ మూలమూర్తి ప్రతిష్ఠ, మహా మంగళ హారతులు నిర్వహించబడును. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదం, అల్పాహారం వితరణ నిర్వహించనున్నారు. 20వ తేదీ శుక్రవారం ఉదయం ఆశ్రమంలో నూతనంగా నిర్మించబోవు శ్రీ గణపతి సచ్చిదానంద సభా మండపం శంకుస్థాపన, నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

# రెండు రాజ్యసభ స్థానాలకు ఎలక్షన్స్

☐ ఈ నెల 26న నోటిఫికేషన్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వితో పాటు, బీఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్.సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుండి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ కూడా మద్దతుగా ఉంటుంది. నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు.మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు, మార్చి 9 వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు పక్రియ నిర్వహించనున్నారు.

## మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు..

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఒంటిపూట బడులు మార్చి 16 నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే బడులు నడుపుతారు. 12.30 గంటల సమయంలో మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న సెంటర్లలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నడుపుతారు. పరీక్షలున్నంత కాలం పదో తరగతి స్పెషల్ క్లాసులు నడుస్తాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఇస్తారు. జూన్ 12 నుంచి 2026 –27 కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమవుతుంది. రంజాన్ నేపథ్యంలో ఉర్దూ మీడియం బడులు, డైట్ కాలేజీలకు ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకు ఒంటిపూట నిర్వహించే వెసులుబాటు ఇచ్చింది. ఉదయం 8 నంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు వీటిని నడపాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పేర్కొన్నారు. మార్చి 20 తర్వాత బడులు, డైట్ కాలేజీలను అదనంగా నడుపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# పోలీస్ క్రీడల్లో జైత్ర యాత్ర

- 33 పతకాలతో అదరగొట్టిన క్రీడాకారులు
- అభినందించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** సైబారబాద్ కమిషనరేట్ లో ప్రారంభమైన రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు రెండో రోజు బుధవారం తమ జైత్ర యాత్రను కొనసాగించారు. ఈ క్రీడల్లో ఇప్పటి వరకు మొత్తం 33 పతకాలను సాధించి అదరగొట్టారు. ఇందులో ఆరు స్వర్ణ పతకాలు, 14 రజిత పతకాలు, 13 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇప్పటి వరకు సాధించిన పతకాల్లో అర్చరీ క్రీడల్లో మూడు విభాగాల్లో మొత్తం తొమ్మిది పతకాలను సాధించగా ఇందులో ఎస్ఐ గైక్వాడ్ అనిల్ కుమార్ మూడు స్వర్ణ పతకాలు, కానిస్టేబుల్ పి.చలపతి మూడు రజిత పతకాలను గెలుచుకోగా, మరో ఆర్చరీ క్రీడాకారుడు ఎల్.రాహుల్ మూడు కాంస్యం పతాకాలను గెలుచుకున్నారు. కరాటే క్రీడలో సీసీఎస్ కానిస్టేబుల్ నరసింహ ఒక స్వర్ణ పతకంతో పాటు, రజితం, కాంస్య పతకాలను గెలుచుకున్నాడు. జూడో క్రీడలో ఏఆర్ ఏఎస్సై రవి, కానిస్టేబుళ్లు రవి, కొండ నవీన్, చంద్రశేఖర్, హరీష్‌లు నాలుగు రజిత పతకాలను గెలుచుకోగా, స్విమ్మింగ్ క్రీడలో మహిళా ఎస్ఐ సాయి దివ్య కాంస్య పతాకాన్ని సాధించింది. అథ్లేటిక్స్ విభాగంలో 4x400 రిలే పరుగులో మహిళలు రజిత పతకం గెలుపుపొందగా,



పురుషుల విభాగంలో కాంస్య పతాకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పతకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందనలు తెలియజేసారు.

### ఘనంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభం..

నాలుగో తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్–2026 క్రీడలకు సంబందించి సైబరాబాద్ కమిషనరేట్ పరేడ్ మైదానం నిర్వహించిన ప్రారంబోత్సవ వేడుకలకు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హజరై ఈ క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడల ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో ఆర్ఎస్ఐ శరత్ నేతృత్వంలో వరంగల్ కమీషనరేట్ పోలీస్ క్రీడాకారులు డీజీపీ వందన సమర్పణ చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com